సాక్షి
ప్రకాశం
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

జిల్లాలో శనివారం వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. లారీ ఢీకొని ఒకరు, మెట్లపై నుంచి జారిపడి ఒకరు, విద్యుదాఘాతంతో మరొకరు మృతిచెందారు.

- 8లో..



చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండండి

జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ కదలికల నేపథ్యంలో పశ్చిమ ప్రకాశం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు హెచ్చరించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
29/26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడుతుంది.

న్యూస్‌రీల్

ఎస్ఎస్ఏలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సిటీ: సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో పలు పోస్టులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఈవో సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్షా కార్యాలయంలోని కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ పోస్టు 1, ఆల్టర్‌నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ పోస్టు-1, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టు 1, ఎంఐఎస్ అండ్ పీఎల్‌జీ కోఆర్డినేటర్ పోస్టు 1, ఏఎస్‌ఓ పోస్టు 1 కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పరిధిలోని స్కూల్స్‌లో పనిచేస్తున్న అర్హులైన స్కూల్ అసిస్టెంట్స్‌లు మాత్రమే ఈ నెల 24వ తేదీ లోపల దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఫారిన్ సర్వీస్ పై పనిచేసేందుకు సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరించిన దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలు, సర్వీస్ రిజిస్టర్ జిరాక్స్‌తో జిల్లా సమగ్ర కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనాను https://prakasam.ap.gov.in/ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

ఊపిరి తీసిన రోల్‌కాల్ భయం..

- రోడ్డు ప్రమాదంలో స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ మృతి
- తలకు హెల్మెట్ పెట్టుకున్నా దక్కని ప్రాణం
- రోల్ కాల్ భయంతో వేగంగా బైక్ నడిపి ప్రాణాలు పోగొట్టుకున్న వైనం
- భార్య 9 నెలల గర్భిణి
- కుమారుడి మృతి వార్త విని తండ్రికి గుండెపోటు



సుభాని మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో స్పెషల్ పార్టీ పోలీస్ మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చీమకుర్తి – ఒంగోలు మధ్యలో చీమలమర్రి వద్ద ఒంగోలు-కర్నూలు రోడ్డుపై జరిగింది. ఒంగోలు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్ పార్టీలో పనిచేస్తున్న షేక్ సుభాని (28) బైకు ముందు వెళ్తున్న లారీని తగలడంతో అదుపుతప్పింది. దీంతో సుభాని రోడ్డుపై పడిపోయాడు. అతని తల రోడ్డుకు బలంగా గుద్దుకోవడంతో హెల్మెట్ పెట్టుకున్నా ఊడిపడిపోయింది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే అతను మృతి చెందాడు. చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సుభానికి భార్య, పిల్లలు ఉన్నారు.

రోల్ కాల్ భయంతో వేగంగా బండి నడిపి...

రోల్ కాల్ భయంతో వేగంగా వాహనం నడిపడం వలనే సుభాని ప్రాణాలు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. సుభాని భార్య ప్రస్తుతం 9 నెలల గర్భిణి. ఆమెకు జనరల్ చెకప్ చేయించేందుకు అధికారుల అనుమతి తీసుకున్న సుభాని శనివారం ఉదయం దోర్నాల వెళ్లాడు. ప్రతిరోజూ రాత్రి 8 గంటలకు ఒంగోలులోని స్పెషల్ పార్టీ కార్యాలయంలో రోల్ వేస్తారు. దీనికి 5 నిముషాలు ఆలస్యమైనా ఆ రోజు ఆబ్సెంట్ కింద పరిగణిస్తారు. రోల్ కాల్ భయంతో త్వరగా ఒంగోలు చేరుకునేందుకు సుభాని బైకును వేగంగా నడిపినట్లు తెలుస్తోంది. ఆ భయమే అతడి ప్రాణాలు మింగేసిందని సాటి ఉద్యోగులు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సుభాని యాక్సిడెంట్లో మరణించిన విషయం తెలియగానే అతడి తండ్రి గుండెపోటుతో కుప్పకూలాడు. ఆయన ఆరోగ్యం విషమంగా ఉంది.

ఎస్పీ సంతాపం...

సుభాని మరణించిన విషయం తెలుసుకున్న ఎస్పీ ఏఆర్ దామోదర్ ఒంగోలు జీజీహెచ్‌కి చేరుకున్నారు. మృతదేహానికి నివాళులర్పించారు. చిన్న వయసులోనే సుభాని మరణించడం బాధాకరమని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కర్షకుడి కష్టం వర్షార్పణం

ఆరుగాలం అన్నదాత రెక్కల కష్టం నీటిపాలైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ రైతును నిండా ముంచేశాయి. ప్రభుత్వం ఆదుకుంటుందనే అభయం లేకపోవడంతో రైతులు బోరుమంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మొన్నటి వరకు తూర్పున.. నిన్నటి నుంచి పశ్చిమాన దంచికొడుతున్నాయి. జిల్లాలో వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ప్రధానంగా సజ్జ, మినుము, అలసంద పంటలు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. మిర్చి, పొగాకు, పత్తి రైతులకు కష్టాలను మిగిల్చాయి. సాగర్ ఆయకట్టు కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంట చేతికొచ్చే దశలో ఉండగా వర్షం నిండా ముంచింది.

- ఎడతెరిపి లేని వానలు
- నీటి ముంపులో పంటలు
- ఖరీఫ్‌లో 1.60 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు
- ఇప్పటి వరకు 4,602 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా
- రూ.350 కోట్లకుపైగా పంట నష్టం
- సజ్జ, మినుము, అలసంద పంటలపై తీవ్ర ప్రభావం
- పొగాకు పంటకు కష్టం.. మిర్చి రైతుకు నష్టం



తర్లుపాడులో నీటమునిగిన మిర్చి పంట

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్‌లో పంటల సాగుకు అనుకూలం కాలేదు. పంటల లక్ష్యం నెరవేరలేదు. దీంతో అంతంతమాత్రంగా సాగు చేసిన పంటలు వాయుగుండం రూపంలో వచ్చిన వర్షాలకు నేలపాలయ్యాయి. దసరా పండుగతో మొదలుపెట్టిన వర్షాలు వరుసపెట్టి కురుస్తూనే ఉన్నాయి. 2024 ఖరీఫ్ సాగు లక్ష్యం 2,02,249 హెక్టార్లు. అయితే అక్టోబర్ 7వ తేదీ వరకు కేవలం జిల్లాలో 1,60,017 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. భారీ వర్షాలతో పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లడంతో అన్నదాత కన్నీటి పర్యంతమవుతున్నాడు. శుక్రవారం కాస్త ఎండ కనిపించిందో..లేదో.. శనివారం వర్షాలు మొదలయ్యాయి. జిల్లాలో ప్రధానంగా సజ్జ, మినుము, అలసంద, పత్తి, వరి, పొగాకు రైతులకు నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తం 22 మండలాల పరిధిలోని ఉద్యానవన పంటలు మిర్చి, పండ్ల తోటలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. వాటిలో మిర్చి 495 హెక్టార్లలో, కూరగాయలు 47 హెక్టార్లలో, అరటి 16, బొప్పాయి 4 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. పొగాకు 5 మండలాల్లో దాదాపు 40 హెక్టార్ల వరకు పొగ నారు విత్తిన పొలాల్లో నీట మునిగింది.

దెబ్బతిన్న పంటల వివరాలు...

పంట	హెక్టార్లలో
సజ్జ	1819
అలసంద	1148
మినుములు	925
జొన్న	03
పత్తి	25
వరి	80

రూ.350 కోట్లకుపైగా పంట నష్టం...

వరుసగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో రూ.350 కోట్లకుపైగా పంట నష్టం వరుస వర్షాల కారణంగా వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 4,602 హెక్టార్లలో పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని అంచనా వేశారు. మొత్తం 17 మండలాల్లో 90 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 4 వేల హెక్టార్లలో 3,300 మందికిపైగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక మోస్తరుగా పంటలు నష్టపోయిన రైతులు మరో ఐదారు వేల మంది ఉన్నట్లు స్పష్టమవుతోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టంపై ప్రాథమిక అంచనాలను సిద్ధం చేస్తున్నారు. పొలాల్లో ఉన్న నీరు బయటకు పోతే కానీ పూర్తి స్థాయి పంట నష్టం అంచనాలు ఒక కొలిక్కి రావు. ఇదిలా ఉండగా శనివారం మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను వారు పరిశీలించారు.



గిద్దలూరు పాములపల్లెలో నీట మునిగిన పొగాకు పంట

- సజ్జ పంట కంకులు కోతకు వచ్చాయి. కోసిన కంకులు పొలాల్లో ఉండడంతో వర్షాలకు తడిసి కంకుల్లోనే మొలక వచ్చింది. జిల్లాలో ఖరీఫ్‌లో 7,125 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 6,466 హెక్టార్లలో సాగు చేశారు. అందులో 1,819 హెక్టార్లలో కోసిన పంట నీటిపాలైంది.

- అలసందను జిల్లాలో 4,500 హెక్టార్లలో సాగు చేశారు. అందులో 1,148 హెక్టార్లలో పంట దెబ్బతింది. పంట సాగు దశలో ఉండటంతో నీట మునిగి మొక్కలు కుళ్లిపోయే స్థితికి చేరుకున్నాయి.

- ఖరీఫ్ సీజన్‌లో సాగర్ ఆయకట్టు కింద త్రిపురాంతకం, తాళ్లూరు, దర్శి, దొనకొండ ప్రాంతాల్లో వరి పంట సాగు చేశారు. ఈ సీజన్‌లో 14,078 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా 9,959 హెక్టార్లలోనే వరి వేశారు. కొన్ని ప్రాంతాల్లో ముందుగా వేయటంతో వరి కంకుల దశకు చేరుకుంది. దీంతో ఈ వర్షాలకు దాదాపు 80 హెక్టార్లలో కంకులతో ఉన్న వరి పైరు తడిసిపోయింది. పంటమీదే ఒరిగి నీట మునిగింది.

- మినుము కోత దశకు చేరుకుంది. కాయ దశలో ఉన్న మినుము పంట వర్షాలకు దెబ్బతింది. ఖరీఫ్ సీజన్‌లో 2,520 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా కేవలం 1509 హెక్టార్లలోనే సాగు చేశారు. అందులో 925 హెక్టార్లలో పంట దెబ్బతింది.

- మిర్చి పంట సాగు దశలో ఉంది. చిన్నపాటి మొక్కలు కావటంతో పొలాల్లో నీళ్లు నిలిచి అవి కాస్తా నీట మునిగి ఉరకెత్తే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 23,873 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటికే దాదాపు 22 వేల హెక్టార్లలో సాగు చేశారు. అందులో 495 హెక్టార్లలో పంట దెబ్బతింది.

- పొగాకు పంట పూర్తి స్థాయిలో సాగు చేయలేదు. వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. అయితే ఇప్పటి వరకు కేవలం జిల్లాలో 6,784 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మొక్క దశలో ఉండటంతో నీట మునిగిన పొలాల్లో నీటిని బయటకు పంపే ప్రయత్నంలో రైతులున్నారు. మొత్తం మీద 40 హెక్టార్లలో మాత్రమే పొగాకు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. జిల్లాలో 750 హెక్టార్లకు పైగా వరి నారుమళ్లు పెట్టారు. ఈ వర్షాలు నారుమడులకు మేలు చేస్తాయని పొగాకు రైతులు చెబుతున్నారు.



ముత్తరాసుపాలెం వద్ద పొలాల్లో చేరిన వర్షం నీరు



నీట మునిగి వేళ్లు కుళ్లిన పొగాకు మొక్కలు



కనిగిరిలో మొలకెత్తిన సజ్జ కంకులు



కొనకనమిట్ల మండలంలో నీట మునిగిన పంట పొలాలు

ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్నాం

"వరుసపెట్టి కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంటలు దెబ్బతింటున్నాయి. అందుకోసం గ్రామ స్థాయి నుంచి దెబ్బతిన్న పంటలను ప్రాథమికంగా అంచనాలు రూపొందిస్తున్నాం. పొలాల్లో నిలిచిన నీరు బయటకు పంపించే పనిలో రైతులున్నారు. ఇంకా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నుంచి వస్తున్న సమాచారం. అందుకోసం సాగు చేసిన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇప్పటికే గ్రామ స్థాయిలో ఉన్న వ్యవసాయ సిబ్బందిని పురమాయించి రైతులకు సూచనలు ఇప్పిస్తున్నాం. పంటలు నష్టపోకుండా ఏవిధమైన చర్యలు తీసుకోవాలో ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. వర్షపు నీరు పూర్తిగా బయటకు పోయిన తరువాత పూర్తి స్థాయి పంట నష్ట అంచనాలు రూపొందిస్తాం."

– ఎస్.శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రైతులకు కోలుకోలేని దెబ్బ..



తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు రైతులకు తీవ్ర నష్టం చేకూర్చాయి. రబీ సాగులో మినుము, అలసంద పంటలతో పాటు మిర్చి, పొగాకు సాగు చేశాం. శుక్ర, శని వారాల్లో కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. నేను సలనూతలలో 25 ఎకరాల్లో బొబ్బర్లు (అలసంద), 6 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. వాటిలో 12 ఎకరాల వరకు పంట నీట మునిగింది. సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను.

– కందెర నాగయ్య, సలనూతల, కొనకనమిట్ల మండలం

ఎన్నికల హామీలకు పాతరేసి కొత్త హామీలు

- ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేదవాళ్లకు ఇచ్చిన హామీలకు పాతరేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో కొత్త హామీల పేరుతో మరో నాటకానికి తెరలేపిందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. యర్రగొండపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి కీలకమైన 6 హామీలను ఎగ్గొడుతూ ఇప్పటి వరకు జరిగిన ఏ క్యాబినెట్‌లో కూడా వాటి ప్రస్తావన తీసుకురానీయలేదని విమర్శించారు. 20 లక్షల ఉద్యోగాలు, నూతన పారిశ్రామిక విధానాలు అంటూ ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో 1 కోటి 40 లక్షల కుటుంబాలు ప్రభుత్వ పథకాలపై ఆధారపడి జీవిస్తున్నాయని, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఆ పథకాలను అమలు చేసి వారి ఇంటివద్దకే చేర్చి ఆదుకుందని అన్నారు. జగనన్న పాలనలో పేదలు తమ జీవితాన్ని ఆనందంగా గడిపారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అమలుకు నోచుకోని పథకాల పేరుతో ప్రజలను వంచించి, ఆశపెట్టి అందలం ఎక్కిన తరువాత వాటిని తుంగలో తొక్కిందన్నారు. 5 నెలల కాలంలో పూర్తిగా ఒక్క పథకాన్ని ప్రవేశపెట్టలేదని అన్నారు. ఈ ప్రభుత్వం బురదను సైతం వదలలేదని, అందినకాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకుని అప్పు చేసి తెచ్చిన రూ.27 వేల కోట్లతోపాటు వరద సహాయ నిధిని విచ్చలవిడిగా దుబారా చేసి ప్రజల బతుకులతో ఆటలాడుకుందని మండిపడ్డారు. పేద కుటుంబాలు కడుపు నింపుకునే బియ్యాన్ని కమీషన్లకు కక్కుర్తిపడి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, చేతకాని ప్రభుత్వంగా ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి కూటమి ప్రభుత్వానికి నెలకొందని, ప్రస్తుతం నాణ్యమైన మద్యం పేరుతో నయా దందాకు తెరలేపిందన్నారు. పేదల కష్టార్జితాన్ని లిక్కర్ మాఫియా లాగేసుకుంటుందని, పక్క రాష్ట్రంలో రూ.90కు అమ్మే చీప్ లిక్కర్‌ను రాష్ట్రంలో రూ.99కు అందిస్తామని ప్రచారం చేసుకొని దానిని కూడా కూటమి ప్రభుత్వం అందివ్వలేక పోతుందని అన్నారు. ప్రభుత్వ అధికారులను తమ బానిసలుగా మార్చుకుంటూ ప్రతి పనికి పైకం కట్టించుకుంటున్నారని, యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జిని కట్టడి చేయలేక పోతుండటంతో పార్టీకి ప్రజలు దూరం అయ్యే పరిస్థితి నెలకొందని ఆ పార్టీ నేతలే బాహాటంగా విమర్శిస్తున్నారని అన్నారు. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోక తప్పదని, ప్రజలకు న్యాయం చేసేందుకు, వారి సమస్యలను పరిష్కరించటానికి తాము ప్రజా పోరాటాలకు వెనకాడబోమని హెచ్చరించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై వార్తలు రాస్తే కేసులా..

కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వార్తలు రాసిన సాక్షి ఎడిటర్‌పై కేసులు పెట్టించడం శోచనీయమని ఎమ్మెల్యే అన్నారు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేసినందుకే ఆయనపై అక్రమ కేసులు బనాయించారన్నారు. 5 నెలల కూటమి ప్రభుత్వంపై తమకు అనుకూలమైన, మధ్యస్థంగా ఉన్న పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాతో సహా దుమ్మెత్తి పోస్తున్నాయని, అయినా వాటిని పక్కన పెట్టి కేవలం సాక్షి మీడియాపై కక్షకట్టి కేసు పెట్టించడం ప్రభుత్వ కుట్రపూరిత చర్య అని అన్నారు. మీడియా వ్యవస్థపై పెత్తనం చెలాయించే ఈ కూటమి ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వర్షాలకు రూ.400 కోట్ల పంట నష్టం

- రైతులందరినీ ఆదుకుంటాం
- కలెక్టర్ తమీమ్ అన్సారియా, మంత్రి స్వామి



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, మంత్రి

తాళ్లూరు (దర్శి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు 3750 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని 3200 మంది రైతులు ఈ పంటలు నష్టపోయారని కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రకటించారు. వర్షానికి దెబ్బతిన్న మండలంలోని రామభద్రాపురంలో మొక్క జొన్న, మాధవరం, శివరాంపురంలలో గుమ్మడి తోటలను మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం రూ.300 నుంచి రూ.400 కోట్ల వరకు పంట నష్టం జరిగిందని అంచనా వేశామన్నారు. 561 హెక్టార్లలో 784 మంది రైతులకు చెందిన మిరప వంటి ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయన్నారు. అన్నీ వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ప్రకృతి కన్నెర్ర చేయడం వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. జిల్లాలో సజ్జ, మొక్కజొన్న, పొగాకు పంటలు వేసిన రైతులు నష్టపోయినట్లు గుర్తించామని తెలిపారు. కొన్నిచోట్ల కంకి మీదే తడిసి మొక్కలు వచ్చాయని చెప్పారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. కౌలు రైతులకు సీఎం ప్రత్యేక చట్టం తీసుకొచ్చి వారికి న్యాయం చేస్తారని చెప్పారు. బ్యాంకులతో మాట్లాడి రైతులకు సహకారం అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎలైట్ గోల్‌మాల్ కేసులో పురోగతేదీ..

- రమణతో ఫోన్లో మాట్లాడిన అధికారి ఎవరు
- రూ.60 లక్షలు తీసుకున్నట్లు చెప్పింది నిజమేనా
- మరి మిగిలిన సొమ్ము ఏమైనట్లు..ఎవరికి ఇచ్చినట్లు
- అప్పటి సీఐ, ఎస్ఐల పాత్ర ఏంటి?
- కానిస్టేబుల్ మీద కేసు నమోదుకు జాప్యం ఎందుకు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఒంగోలులోని రెండు ఎలైట్ మాళ్లలో రూ.2.35 కోట్ల గోల్‌మాల్ వ్యవహారంలో పరారీలో ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ చౌదరి శుక్రవారం ఒక ఉన్నతాధికారికి ఫోన్ చేసినట్లు వస్తున్న వార్త చర్చనీయాంశంగా మారింది. జిల్లా స్థాయిలోని ఒక కీలక అధికారికి ఫోన్ చేసిన రమణ తాను రూ.60 లక్షలు తీసుకున్నానని అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. మరి మిగిలిన సొమ్మును ఎవరు మింగేశారన్నది ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. ఒంగోలులోని రెండు ఎలైట్ మాళ్లలో రూ.2.35 కోట్లను వెరిఫికేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన కానిస్టేబుల్ మార్నేని రమణ నొక్కేసినట్లు అక్కడి సిబ్బంది ఫిర్యాదు చేయడంతో బయటపడింది. ఈ వ్యవహారంలో ప్రధాన పాత్రధారిగా భావిస్తున్న కానిస్టేబుల్ రమణ పరారీలో ఉన్నాడు. దీంతో ఆయన పాత్రపై సిబ్బంది చేస్తున్న ఫిర్యాదుకు బలం చేకూరింది. అయితే ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖకు చెందిన సంబంధిత ఉన్నతోద్యోగులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకపోగా రమణ ఆచూకీ తెలియడం లేదని మాత్రం చెబుతున్నారు. అతడికి సంబంధించిన ఫోన్లపై నిఘా పెట్టామని, శుక్రవారం సాయంత్రానికల్లా రమణను తీసుకొని వస్తామని పోలీసు అధికారులు చెప్పినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.. కానీ ఆదేరోజు రాత్రి కానిస్టేబుల్ ఎక్సైజ్ శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారికి ఫోన్ చేశాడు. ఇది కాకతాళీయంగా జరిగిందా లేక ఒక వ్యూహం ప్రకారం జరిగిందా అనేది తెలియడం లేదు.

ఫోన్ ఎందుకు ట్రేస్ చేయలేదు...

ఇంతకూ సదరు అధికారితో రమణ ఏం మాట్లాడాడు. తనకు సహకరించిన వారి పేర్లను వెల్లడించాడా లేదా. లేకపోతే మిగిలిన సొమ్ము ఎవరికైనా ఇచ్చినట్లు చెప్పాడా అనేది తెలియాల్సి ఉంది. అంతేకాకుండా రమణ ఫోన్ చేసినప్పుడు అతడు ఉన్న లొకేషన్ సులువుగా తెలిసిపోతుంది. అతడిని వెంటనే పట్టుకునే అవకాశం ఉంది. అయినా అలాంటి ప్రయత్నాలు చేసినట్లు కనిపించడం లేదు. శనివారం రాత్రి వరకు కూడా రమణ ఆచూకీ లభించలేదనే ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మోహిద్దీన్ చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. అసలు రమణ ఫోన్ చేశాడా, లేక ఫోన్ చేసినట్లు పుకారు పుట్టిస్తున్నారా అనేది విషయంపై కూడా ఆ శాఖలోని ఉద్యోగులు కొందరు చర్చించుకుంటున్నారు.

రెండు ప్రధాన బార్‌లకు మాల్ మద్యం...

కానిస్టేబుల్ రమణ మాల్‌లోని మద్యాన్ని స్కాన్ చేయకుండా అమ్మినట్లు అధికారులు చెబుతున్న విషయం తెలిసిందే. నిజానికి కొంత మద్యాన్ని నగరంలోని రెండు ప్రధాన బార్ అండ్ రెస్టారెంట్‌లకు విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు ఆ కోణంలో విచారిస్తే మరికొన్ని వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

ఆర్డీఓ విచారణలో ఏం తెలిసింది...

రెండు రోజులుగా ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న ఎక్సైజ్ అక్రమాలపై విచారణ చేస్తున్నారు. శుక్రవారం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఆమె విచారించారు. రెండో రోజు కూడా ఈ విచారణ కొనసాగింది. అయితే ఇప్పటి వరకు విచారణలో ఏం తేలిందన్న సమాచారం తెలియదు. ఈ విచారణలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది తమ పాత్ర ఏమీ లేదని చెప్పినట్లు సమాచారం. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని మాత్రమే విచారించారా లేక అప్పటి ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలను కూడా విచారించారా అనేది తెలియదు.

క్లుప్తంగా

గుండ్లకమ్మలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



బయటకు తీసిన బ్రహ్మనాయుడు మృతదేహం



బ్రహ్మనాయుడు (ఫైల్)

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెం సమీపంలో గుండ్లకమ్మ నదిలో గురువారం సాయంత్రం ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడు గంగిశెట్టి బ్రహ్మనాయుడి (30) మృతదేహం శనివారం ఉదయం లభ్యమైంది. శుక్రవారం సాయంత్రం వచ్చిన ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది శనివారం ఉదయం గుండ్లకమ్మ నదిలోకి పడవలతో వెళ్లి సుమారు 600 మీటర్ల దూరంలో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. అందుకోసం మూడు గంటల పాటు గుండ్లకమ్మ నదిలో గాలించారు. మృతదేహాన్ని చూసి యువకుడి బంధువులు భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి మద్దిపాడు పోలీసులు తరలించారు. బ్రహ్మనాయుడుకు భార్య, కుమార్తె ఉన్నారు. వారి రోదనలతో గ్రామస్తుల గుండె బరువెక్కింది.

చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తంగా ఉండండి

- మార్కాపురం డీఎస్పీ నాగరాజు హెచ్చరిక
- అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచన



మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ కదలికల నేపథ్యంలో పశ్చిమ ప్రకాశం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం డీఎస్పీ ఉప్పుటూరి నాగరాజు హెచ్చరించారు. తాము చెడ్డీ గ్యాంగ్ కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని, అయినప్పటికీ అనుమానితులు, కొత్తవ్యక్తుల సంచారం ఉంటే వెంటనే దగ్గరలోని పోలీసులకు ప్రజలు సమాచారం అందించాలని తెలిపారు. మార్కాపురంలోని తన కార్యాలయంలో శనివారం మీడియాతో డీఎస్పీ మాట్లాడారు. పండుగల సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు రెండుమూడు రోజులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నారని, అటువంటి ఇళ్లను చెడ్డీగ్యాంగ్ టార్గెట్ చేస్తోందని తెలిపారు. ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు దగ్గర్లో ఉన్న పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఊరి చివర్లో ఉన్న దేవాలయాలపై కూడా చెడ్డీగ్యాంగ్ కన్నేసిందని, హుండీలకు తాళాలు పగులగొట్టి నగదు, ఆభరణాలు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఒంగోలులో చెడ్డీ గ్యాంగ్ కదలికలు బయటపడ్డాయన్నారు. నేరస్తులు వివిధ రకాలుగా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా పోలీసుల పేరుతో మోసం చేసే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించారు. ఇళ్లవద్దకు వచ్చి ఈ బజారులో దొంగతనం జరిగింది.. మీ ఇంట్లోని ఆభరణాలు జాగ్రత్త చేసుకోండి అంటూ రకరకాలుగా మోసం చేస్తారని తెలిపారు. వాట్సాప్‌లో వచ్చే తెలియని లింకులను ఓపెన్‌చేయడం, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా తెలియని వ్యక్తులకు డబ్బులు పంపడం వంటివి చేసి మోసపోవద్దని తెలిపారు. మార్కాపురం, యర్రగొండపాలెం, కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, గిద్దలూరు ప్రాంతాల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లాడ్జిలకు ఎవరైనా వస్తే వారి అడ్రస్ ప్రూఫ్‌లు తీసుకున్న తర్వాతే రూములు కేటాయించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలు భయపడాల్సిన పనిలేనప్పటికీ జాగ్రత్తగా మాత్రం ఉండాలని డీఎస్పీ సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

దొనకొండ: జిల్లాలో శనివారం జరిగిన మూడు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. లారీ ఢీకొనడంతో ఒంటరి మహిళ శనివారం మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలో శనివరం జరిగింది. ఎస్సీ పాలేనికి చెందిన చీరాల సంతమ్మ (55) అనారోగ్యంతో ఆర్‌ఎంపీ వైద్యుని దగ్గరకు వెళ్ళి చూపించుకుని తిరిగి ఇంటికి వస్తోంది. అదే సమయంలో మాచర్ల నుంచి దొనకొండకు కేసీపీ సిమెంట్ లారీ వెళుతోంది. లారీ డ్రైవర్‌కు దారి తెలియక లారీ నిలిపివేసి దొనకొండకు ఎటు వెళ్ళాలని స్థానికులను అడుగుతున్నాడు. ఆ లోపు సంతమ్మ రోడ్డు దాటుతుండగా.. లారీ డ్రైవర్ చూడక ముందుకు కదిలించాడు. దీంతో ఆమె టైర్ల కింద పడి నడుము, కాలు పూర్తిగా విరిగాయి. గ్రామస్తులు ఆమెను మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్ల నుంచి జారిపడి..

మార్కాపురం రూరల్: మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలి మృతి చెందిన శనివారం సాయంత్రం జరిగింది. మండలంలోని గొట్టిపడియ గ్రామంలో బంగారు సుబ్బమ్మ (75) వర్షం పడటంతో మెట్లు దిగుతూ కాలుజారి పడి మృతి చెందింది. బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. అందరితో కలివిడిగా ఉండే సుబ్బమ్మ ఇక లేరని ఆవేదన చెందారు.

విద్యుదాఘాతంతో..

దొనకొండ: రైతులకు సహాయం చేసేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చందవరం గ్రామ పొలాల్లో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన తేలిక నాగార్జున (26) అదే గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. విద్యుత్ విషయంలో కొద్దిగా పరిజ్ఞానం ఉండటంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ ఎడ్జ్ ఫీజు వేయాలని అడిగారు. నాగార్జున ఫీజు వేస్తుండగా వెంటనే ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. అల్లారుముద్దుగా చూసుకునే తండ్రి చనిపోవటంతో కూతుర్లు శోక సముద్రంలో మునిగి పోయారు. మంచి వాడు, సౌమ్యుడు అయిన నాగార్జున మృతితో గ్రామస్తులు, బంధువులు విలపించారు. ఎస్‌ఐ కె.విజయ్ కుమార్ పరిశీలించి కేసు నమోదు చేస్తామన్నారు. ఏఈ షేక్.నాగూర్‌వలి మాట్లాడుతూ నష్ట పరిహారం వచ్చే విధంగా ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు.



మృతి చెందిన సంతమ్మ

దళిత యువకుడి కిడ్నాప్

మార్కాపురం రూరల్: తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించలేదనే నెపంతో ఏకంగా ఓ దళిత యువకుడిని కిడ్నాప్ చేసి బంధించిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుంది. అయితే శనివారానికే మార్కాపురం పోలీసులు అతన్ని గుర్తించి రక్షించారు. వివరాలు.. మార్కాపురం మండలంలోని కందివారిపల్లి గ్రామానికి చెందిన మేకల నాగరాజు కొన్ని నెలల నుంచి పట్టణానికి చెందిన మెట్టు రంగారెడ్డికి చెందిన ఇనుము దుకాణంలో గుమస్తాగా, ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా తనకు తెలిసిన బంధువులకు దుకాణంలో ఇనుము ఇప్పించాడు. అదే సమయలో నాగరాజు అవసరాల నిమిత్తం యజమాని రంగారెడ్డి దగ్గర సుమారు రూ. 5 లక్షలు వరకు అప్పు చేశాడు. డబ్బు తిరిగి చెల్లించాలని ఎన్నిసార్లు నాగరాజును అడిగినా ఇవ్వలేదు. దీంతో శుక్రవారం ఉదయం మెట్టు రంగారెడ్డి, బట్టగిరి రంగారెడ్డిలు మండలంలోని కందివారిపల్లిలోని నాగరాజు వద్దకు వెళ్లారు. షాపులో పని ఉందని చెప్పి వారి మోటారు సైకిల్‌పై పట్టణంలోని రంగారెడ్డికి చెందిన ఇనుము షాపుకు తీసుకెళ్లారు. అక్కడ కూర్చోబెట్టి కులంపేరుతో దుర్భాషలాడారు. డబ్బులిచ్చేంతవరకూ వదిలిపెట్టమని చెప్పి షట్టర్ తాళాలు వేసి వెళ్లారు. నాగరాజు తన ఫోన్ ద్వారా భార్యకు సమాచారమిచ్చాడు. దీంతో ఆమె శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో డీఎస్పీ, సీఐ, ఎస్సైలకు ఫోనులో ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన రూరల్ ఎస్సై అంకమరావు తన సిబ్బందితో ఫోన్ లోకేషన్ ద్వారా సంఘటనా స్థలానికి వెళ్లి షట్టర్ తాళాలు పగులగొట్టి నాగరాజును బయటకు తెచ్చారు. అనంతరం నాగరాజు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కిడ్నాప్‌కు ప్రయత్నించిన వారిలో పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



మేకల నాగరాజు

ఎస్సైకి అభినందనలు

గంటల్లోనే కిడ్నాప్ కేసును ఛేదించి పలువురికి ఆదర్శంగా నిలిచిన మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావును పలువురు అభినందించారు. ఇటీవల కాలంలో విజయవాడ నుంచి తల్లిని వెతుక్కుంటూ మార్కాపురం రైల్వేస్టేషన్‌కు వచ్చినగా రైల్వే ప్రయాణికులు గుర్తించారు. ఈ విషయం ఎస్సైకి చెప్పడంతో ఆయన వెంటనే స్టేషన్‌కు తీసుకొచ్చి సోషల్‌మీడియా ద్వారా సమాచారం చేర వేయడంతో తల్లి గుర్తించి వెంటనే తీసుకెళ్లింది. ఇలా వారం వ్యవధిలో ఆయన ప్రతిభ కనబరచడంతో ఉన్నతాధికారులు రూరల్ ఎస్సైని అభినందించారు.